వన్‌టౌన్ రహదారి విస్తరణ జరిగేది ఇలా..

జగదాంబ జంక్షన్ నుంచి పాత నగరం వరకు	ప్రతిపాదించిన మొత్తం వ్యయం: రూ. 12 కోట్లు	రహదారి విస్తరణకు కేటాయించిన మొత్తం రూ. 4.50 కోట్లు	కాలువల నిర్మాణానికి చేసే ఖర్చు రూ. 4.50 కోట్లు	ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ. 3 కోట్లు

మార్గం.. సుగమం



వన్‌టౌన్‌లో జరుగుతున్న రహదారి విస్తరణ పనులు

- శరవేగంగా వన్‌టౌన్ రహదారి విస్తరణ
- వ్యాపారులు, స్థానికులకు ఇబ్బంది లేకుండా పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నిర్మాణ దశలో కాలువలు

గతంలో జగదాంబ నుంచి పూర్ణామార్కెట్, వెలంపేట, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం కూడలి, పాతపోస్టాఫీసు తదితర ప్రాంతాలకు ప్రయాణించాలంటే ఎంతో కష్టంగా ఉండేది. ఎందుకంటే ఇరుకైన రహదారి.. ఆ రహదారిపైనే చిరు వ్యాపారుల దుకాణాలు, వాహనాలు, పాదచారులతో ఆ ప్రాంతాల్లో ప్రయాణం ఇబ్బందికరంగా ఉండేది. ఈ రహదారిని విస్తరిస్తామని గత ప్రభుత్వాలు స్థానిక ప్రజలు, వ్యాపారులకు హామీ ఇచ్చినా ఏనాడూ ఆ పని చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక అన్న మాట ప్రకారం వన్‌టౌన్ రహదారి విస్తరణ పనులను ప్రారంభించింది. రూ. 12 కోట్ల నిధులు మంజూరు చేసి రోడ్ల విస్తరణతో పాటు కాలువల నిర్మాణం కూడా ఏకకాలంలో పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతోంది. దీంతో ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగదాంబ : పాతనగర రహదారి విస్తరణ వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైంది. గత ప్రభుత్వంలో నాయకులు వన్‌టౌన్ రహదారిని విస్తరిస్తామని చెప్పడమే కానీ ఆ దిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు మాత్రం లేవు. చివరికి జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇరుగ్గా ఉండే ఈ రహదారిని విస్తరించేందుకు రంగం సిద్ధం చేసింది. తొలుత వంద అడుగుల మేర విస్తరించాలని నిర్ణయం జరిగింది. అయితే అంత మేర విస్తరిస్తే చిరు వ్యాపారులు నష్టపోతారని భావించి విస్తరణను 80 అడుగులకు కుదించింది. మరోసారి పునరాలోచన చేసి చివరికి 60 అడుగులకు విస్తరించాలని అంతిమంగా నిర్ణయం తీసుకుంది. దీనివల్ల అటు వ్యాపారులకు, ఇటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రభుత్వం భావించింది. దీంతో వ్యాపారులు, ప్రజలు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. ఉభయకుశలోపరి అన్నట్లు ఈ నిర్ణయం అందరికీ మేలు చేస్తుందని అంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పుడు పాతనగర రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రహదారి విస్తరణ దాదాపు పూర్తి కావొచ్చింది.



ఉదారంగా నిధులు..

రహదారి విస్తరణకు నివేదిక అందజేయడమే తడువు ప్రభుత్వం వెంటనే రూ. 12 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారితో పాటు కాలువలు, ఫుట్‌ఫాత్‌లు కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తి కావడంతో కాలువల నిర్మాణం కూడా జోరందుకుంది.

60 అడుగులు మేలు చేసింది..



ముందుగా అనుకున్నట్టు 100 అడుగులు గానీ, 80 అడుగులు గానీ విస్తరిస్తే మేమంతా రోడ్డున పడేవాళ్లం. అంత మేర రోడ్డు కొట్టేస్తే మా ఇళ్లు, దుకాణాలు దాదాపు పూర్తిగా పోయేవి. 60 అడుగుల మేర విస్తరిస్తున్నారు కాబట్టి ఎవరికీ ఎలాంటి బాధ లేదు. –వెంకటరావు, పందుపుల్లల సందు భవన యాజమాని

రోడ్డు విస్తరణ బాగుంది..



రోడ్డు విస్తరణతో వన్‌టౌన్ ప్రాంతం కళకళలాడుతోంది. దుకాణాల తొలగింపుతో రహదారి విశాలంగా కనబడుతోంది. వాహనాలు, పాదచారుల రాకపోకలకు వీలుగా ఉంది. రహదారి విస్తరణ పూర్తి అయితే మరింత బాగుంటుంది.

–రాము, పందుపుల్లల సందు భవన యాజమాని

చిరువ్యాపారులకు అనుకూలంగా...



రోడ్డు విస్తరణ చిరు వ్యాపారులకు అనుకూలంగా ఉంది. ఇరుకు రోడ్డు వలన నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఉండేవి. రహదారిని ప్రణాళికతో విస్తరించడం వల్ల ఇటు వ్యాపారులకు, అటు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పాలి.

–సుబ్రహ్మణ్యం, పూర్ణామార్కెట్ వ్యాపారి

వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైంది..



ఏదైనా అభివృద్ధి జరుగుతుందంటే అది కేవలం వైఎస్సార్‌సీపీతోనే. ఎన్నో ఏళ్లుగా వ్యాపారులు, జీవీఎంసీ మధ్య సమస్యగా ఉండిపోయిన రహదారి విస్తరణ పనులు చివరికి ఎవరూ ఇబ్బంది పడకుండా సజావుగా సాగుతున్నాయి. ఇది జగనన్న ప్రభుత్వ విజయమనే చెప్పాలి.

– వెంకటరాజు, చిరు వ్యాపారి, వన్‌టౌన్

మా వ్యాపారాలు బాగున్నాయి..



రోడ్డు విస్తరణ పరిధిలో సుమారు 480 దుకాణాలు ఉన్నాయి. రహదారి నిర్మాణానికి అందరూ స్పందించారు. ఎవరికి వారే స్వయంగా నిర్మాణాలు తొలగించి ప్రభుత్వానికి సహకరించారు. గతం కంటే ఇప్పుడు రోడ్డు బాగుంది. పార్కింగ్ ఏర్పాటు కావడంతో మా వ్యాపారాలు బాగున్నాయి.

–ఆదినారాయణ, వ్యాపారి, వన్‌టౌన్

క్లుప్తంగా

మాలధారులకు 11 రోజులు భిక్ష



మాలధారులకు అల్పాహారం అందజేస్తున్న వివేకానంద సంస్థ సభ్యులు

జగదాంబ : అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు అన్నారు. పదకొండు రోజులు మాలధారణ భక్తులకు ఉచితంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములకు అల్పాహారం కూడా అందజేయనుండటం ఆనందకరమన్నారు. ఇప్పటికి 36 సార్లు మాలధారణ చేసిన అప్పలరాజు గురుస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి మృతికి సంతాపం



విజయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీ తదితరులు

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తల్లి దశదిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం ఆమె చిత్రపటం వద్ద పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఎస్ఏ రెహ్మాన్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వేంకటేశ్వరరావు (జీవీ), కంపా హనోక్, వెంపాడు శ్రీనివాసరెడ్డి, సనపల చంద్రమౌళి, చొక్కర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీలకు మారు పేరు 'నీలం'



నీలం రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పైడిరాజు తదితరులు

అల్లిపురం : నీతి, నిజాయితీలకు మారు పేరు నీలం రాజశేఖర్‌రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నీలం రాజశేఖర్‌రెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా బుధవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన నీలం రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు సైద్ధాంతిక శిక్షణ ఉండేనే పార్టీ ఎదుగుతుందని నమ్మి అందుకు కృషి చేసిన మహనీయుడన్నారు. ఆయన బాటలో కమ్యూనిస్టులందరూ నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్, నాయకులు ఎండీ బేగం, బి.పుష్పలత, భాస్కర్, జి.కాసులరెడ్డి, ఎస్.అప్పన్న, కె. చిరంజీవి, సీహెచ్ కాసుబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ప్రత్యేక యోగ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి జనరల్, స్థూలకాయ, థెరపటిక్, వెన్నునొప్పి, మెడనొప్పి నివారణకు ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 93980 19922, 94944 01919, 83743 51324 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి



రైల్వే క్వార్టర్స్‌లోని శ్రీ భవానీ శంకర ఆలయం వద్ద దీపాలు వదులుతున్న మహిళలు



ఆర్కేబీచ్‌లో ఇసుకతో శివలింగం చేసి పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం : కార్తీక మాసం ముగియటంతో మార్గశిర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జాము నుంచే మహిళలు గుడుల బాట పట్టారు. ఇంట్లో అన్ని రకాల పిండి వంటలు తయారు చేసి, నైవేద్యాలు సమర్పించిన తర్వాత పోలికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు కొలనులకు బయలుదేరారు. ఈ మేరకు నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సంఘాలు, దేవాలయ కమిటీలు కృత్రిమ కొలనులు ఏర్పాటు చేశాయి. అక్కడ మహిళలు గంగమ్మకు పూజలు చేసి అరటి డొప్పల్లో నేతి దీపాలు వెలిగించి పోలికి ఘనంగా వీడ్కోలు పలికారు.



అల్లిపురంలోని ధనశక్తి దుర్గాదేవి పీఠం వద్ద కొలనులో దీపాలు వదులుతున్న భక్తులు

దేవాలయాలు కిటకిట..

కార్తీక మాసం నెలరోజులు పూజలు చేసిన మహిళలు పాడ్యమి సందర్భంగా బ్రాహ్మణులకు ఘనంగా దానాలు ఇచ్చుకున్నారు. అన్నదానం, వస్త్రదానం, దీపదానం, శాలిగ్రామదానం చేసేందుకు క్యూలు కట్టారు. వేంకటేశ్వరమెట్ట, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడాయి. ఆర్కేబీచ్‌లో భక్తులు ఇసుకతో శివలింగం తయారు చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, దీపాలు వెలిగించి గంగమ్మకు నమస్కరించుకున్నారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన సభ్యులు

దాబాగార్డెన్స్ : సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా, పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షురాలిగా డాక్టర్ జాలాది విజయ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జాతీయ నాయకుడు మధు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీగా సమాజ్‌వాది పార్టీని తీర్చిదిద్దుతామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర యాదవ్ మాట్లాడుతూ తాము పార్టీని సామాన్యుని చెంతకు తీసుకెళ్తామన్నారు. పార్టీ జనరల్ సెక్రటరీగా కోన గురవయ్య, విశాఖ జిల్లా మహిళా కన్వీనర్‌గా మను పల్లా, ఏలూరు ఇన్‌చార్జిగా రాజా శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ కన్వీనర్‌గా కొణతాల రాధ, పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా గురుమూర్తి, గాజువాక ఇన్‌చార్జిగా విజయలక్ష్మి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జిగా శ్రీరామ్, పలువురు పార్టీ కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బలివాడ రమేష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

అగర్‌బత్తుల తయారీలో మహిళలకు ఉచిత శిక్షణ



అగర్‌బత్తుల తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు

దాబాగార్డెన్స్ : నగరంలోని హవామహల్ ప్రాంగణంలో ఇంటెక్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించే దిశగా, వినియోగించిన పుష్పాలతో అగర్‌బత్తులు తయారు చేసే విధానంపై ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభం అయింది. జైపూర్ రాజమాత మయాంక్‌కుమార్‌దేవ్ బుధవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ శిక్షణ ద్వారా మధ్య తరగతి మహిళలు ఉపాధి పొందాలన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ డి. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఇంటెక్ సహకారంతో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా విశాఖపట్నంలో అగర్‌బత్తుల తయారీలో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. కో కన్వీనర్ డాక్టర్ బి. సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఇంట్లో, దేవాలయంలో పూజకు వినియోగించిన పుష్పాలు బయట పారేయకుండా సంస్థకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలకు లక్నోకి చెందిన డాక్టర్ రమేష్ శ్రీవత్సవ్, ప్రియాంక సింగ్, సాక్షి అవస్తి అగరబత్తుల తయారీ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్వర్డ్‌పాల్, చిట్లూరి గిరిధర్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

13 ఆటోలపై కేసులు నమోదు



ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

గోపాలపట్నం: మద్దిలపాలెం, ఎన్ఏడీ ప్రాంతాల్లో బుధవారం రవాణా శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 13 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన తనిఖీల్లో 36 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. తనిఖీల్లో అధికారులు రాజారావు, గణేష్ రెడ్డి, మాధవి, ఎస్.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఏడీలో ప్రత్యేక తనిఖీలు..

రహదారి భద్రత నిబంధనలు పాటించని వాహనాలు, రాంగ్ రూట్లో వచ్చే వాహనాలను తనిఖీ చేసి.. 38 వాహనాలపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. వాహన చోదకులకు అవగాహన కల్పించారు. భారీ వాహనాలు మాత్రమే ఫ్లైఓవర్‌పై వెళ్లాలని డీటీసీ సూచించారు. అధికారులు రామ్‌కుమార్, సుధీర్, ఏఎస్ ప్రకాష్‌రావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.

'విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోండి'

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దర్శనానికి విచ్చేసే భక్తులు విలువైన వస్తువులు, మనీపర్స్‌లు, హ్యాండ్ బ్యాగులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని వన్‌టౌన్ క్రైమ్ ఎస్ఐ ఎస్. రామ్మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టూవీలర్స్ పార్క్ చేసేటప్పుడు హ్యాండిల్ లాక్ సరిగ్గా వేసుకోవాలని, క్యూలైన్లలో మీకు తెలియకుండానే మీ హ్యాండ్‌బ్యాగుల నుంచి విలువైన వస్తువులు దోచుకుపోతారని, మీ మెడలో ఉన్న వస్తువులు మీకు తెలియకుండానే రద్దీగా ఉండే టప్పుడు తెంపుకుపోతారని చెప్పారు. నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు కూడా మీ వస్త్రాన్ని మెడపై ధరించి వెళ్లాలని, ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లలో సీసీ కెమెరా నిఘాను పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. క్రైం పోలీసులు యూనిఫాం, మఫ్టీలో పర్యవేక్షిస్తుంటారని, ఎవరైనా అనుమానంగా ఉన్నట్టు కనిపించినా, దొంగతనం చేసినట్టు చూసినా సమీపంలో గల పోలీసులకు అప్పగించాలన్నారు.

మంత్రి అమర్‌ను కలిసిన మాజీ క్రికెటర్ రాయుడు



మాజీ క్రికెటర్ అంబటి రాయుడును సన్మానిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: మాజీ క్రికెటర్ అంబటి రాయుడు బుధవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని మంత్రి నివాసంలో రాయుడును మంత్రి శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. నగరంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన రాయుడు.. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్యతో పాటు మంత్రిని కలిశారు.

వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీకి చర్యలు

ఆరిలోవ: జూలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఈ నెల 20 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెలకు రూ.50 వేలు వేతనం చెల్లించనున్నామని, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు జూ క్యూరేటర్ ఆఫీస్‌లో నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



అచ్చియ్యమ్మపేట సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పద్మావతి, నీలకంఠం తదితరులు



37వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ జానకీరామ్

అల్లిపురం : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని.. అందుకే ఆయనే మళ్లీ సీఎం కావాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. బుధవారం మధ్యాహ్నం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠంతో కలిసి ఆమె పాల్గొన్నారు. సచివాలయ ఇన్‌చార్జి, కన్వీనర్లు అత్తిలి అనిల్, సూరిబాబు, బి.గోవిందరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైనాట్ 175 నినాదాన్ని నిజం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. అనంతరం సచివాలయం పరిధిలో గల పెద్దలు, వృద్ధులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, దూడ అప్పారావు, తాతబ్బాయి, వాసుపల్లి నారాయణ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

37వ వార్డులో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డు నేవల్ క్యాంటీన్ సచివాలయ పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మండల అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి గడపకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని.. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటిపై వైఎస్సార్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. సచివాలయ పరిధిలో ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ, ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, డాక్టర్ రమణ, శేఖర్, దైవకుమార్, రోజా, చొక్కాకుల ఆనంద్, రామచంద్రరావు, వంశీ, గిడిజాల ఉమామహేశ్వరరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు శతశాతం వ్యాధి నిరోధక టీకాలివ్వాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం కేజీహెచ్‌లోని ప్రత్యేక పిల్లల వార్డును సందర్శించారు. వైద్య పరికరాల ఆవశ్యకత గురించి విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.రాజుతో చర్చించారు. చిన్నారులకు శతశాతం వ్యాధి నిరోధక టీకాలివ్వాలన్నారు. 12 వారాలలోపు గర్భిణులను నమోదు చేయాలని, వారు పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

యదార్థ ఘటనల దృశ్యమాలిక 'డ్యూటీ' నవల

మహారాణిపేట : వాస్తవ ఘటనలనే కథా వస్తువులుగా స్వీకరించి రచనలు చేసే ఆదిరెడ్డి మావుళ్లు ఆవిష్కరించిన యదార్థ ఘటనల దృశ్యమాలికే డ్యూటీ నవల అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదిరెడ్డి మావుళ్లు రచించిన డ్యూటీ నవలను ఆవిష్కరించారు. సామాజిక ప్రయోజనాన్ని బలంగా నమ్మి బాధ్యతాయుతంగా రచయిత వెలువరించిన రచనగా డ్యూటీ నవలను పేర్కొన్నారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీవీ సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఎస్. హనుమంతరావు, ఉప్పల అప్పలరాజు, బండి సత్యనారాయణ, పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

17 వరకు పుస్తక మహోత్సవం..

విశాలాంధ్ర పుస్తక మహోత్సవం ఈనెల 17 వరకు కొనసాగుతుందని మేనేజర్ పి.ఎ.రాజు తెలిపారు. గత వారం తుపాను కారణంగా మూడు రోజుల పాటు ప్రదర్శనకు స్వల్ప అంతరాయం ఏర్పడిందన్నారు. గడువు పెంచాలని పాఠకులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు కోరిన నేపథ్యంలో మరో రెండు రోజులు అనగా 17 వరకు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు రాజు తెలిపారు.